క్లుప్తంగా

రైతులను ఆదుకోవడంలో 'కూటమి' వైఫల్యం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్



పుల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. రైతులకు పంట బీమా రుణమాఫీ, కనీస మద్దతు ధర హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు పూర్తిగా పరిహారం అందించలేదన్నారు. ఎరువులు, విత్తనాలు డీజిల్ ధరలు పెరిగినా.. సబ్సిడీలను ప్రభుత్వం తగ్గించిందని విమర్శించారు. యూరియా కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వంలోనే చోటు చేసుకుందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సమృద్ధిగా సరఫరా చేసినట్టు గుర్తు చేశారు. రైతుల అవస్థలపై ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదని మండిపడ్డారు. రైతుల కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 9న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పరామర్శ

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంధం పుల్లయ్య ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను సూర్యప్రకాశ్ పరామర్శించారు. సర్పంచ్, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ ఎంపీటీసీ దడాల రవికుమార్ పాల్గొన్నారు.

కార్యాలయంలోనే బిల్లు కలెక్టర్ కునుకు



కుర్చీలో నిద్రపోతున్న బిల్లు కలెక్టర్

రాయవరం: పసలపూడి సచివాలయంలో బిల్లు కలెక్టర్ సలాది వీరశంకర రావు శుక్రవారం తన సీటులోనే కునుకుతీశారు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వెళ్లిన సమయంలో ఎవరో ఈ ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై బిల్లు కలెక్టర్‌ను వివరణ కోరగా, తాను కార్యాలయానికి వస్తున్నప్పుడు కుక్క అడ్డొచ్చి ప్రమాదానికి గురయ్యాయన్నారు. వైద్యులిచ్చిన మందుల ప్రభావంతో మగతకు లోనయ్యానన్నారు. గిట్టని వాళ్లు ఇలా చేసి ఉంటారని చెప్పారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవటం ద్వారా నియంత్రణ సాధ్యమవుతుందని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరగడంతో ఎన్‌సీడీసీడీ 4.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించటం ద్వారా, చికిత్స అందించి మరణాలను తగ్గించవచ్చన్నారు. అమలాపురం, రామచంద్రపురంల్లో ఇప్పటివరకు 334 మంది శిక్షణ పొందారని తెలిపారు. డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ ఇందిర, డాక్టర్ లోవసుధ శిక్షణ ఇచ్చారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ

కపిలేశ్వరపురం: పాలనాపరమైన అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పూర్తి అవగాహన అవసరమని ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, తహసీల్దార్ జి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మండపేటలో..

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పీఏఐ 2.0పై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పురోగతి సూచికపై ఒక రోజు శిక్షణను రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఈ–యాపారం.. సూపర్ బాస్

- పల్లెల్లో జోరుగా డిజిటల్ చెల్లింపులు
- చిల్లర సమస్య లేదంటున్న వ్యాపారులు
- పెరుగుతున్న ఆన్‌లైన్ కార్యకలాపాలు



కూరగాయల షాపు వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

కె.గంగవరం: గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చేవారు, కాలం మారింది. టీ తాగాలన్నా మార్కెట్లో సరకులు, కూరగాయలు కొనుగోలు చేయాలన్నా, మెడికల్ షాపుల్లో మందులు కొనాలన్నా జేబులో స్మార్ట్ ఫోన్, బ్యాంకు ఖాతాలో తగినంత డబ్బు ఉంటే చాలు. లావాదేవీలను సులభంగా చేసుకోవచ్చు. గతంలో షాపింగ్ మాల్స్ వంటి పెద్ద వాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకూ చేరాయి. పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి క్యూఆర్ కోడ్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు.

పల్లెల్లో సైతం..

పట్టణాలకే పరిమితమనుకున్న డిజిటల్ లావాదేవీలు ఇప్పుడు మారుమూల పల్లెల్లోనూ విస్తరించాయి. ప్రస్తుతం చిరు వ్యాపారులూ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. డిజిటల్ లావాదేవీలు పెరడగంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి డిజిటల్ కూఆర్ కోడ్‌లు, స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల్లోని మారుమూల గ్రామాల్లోనూ టీ, టిఫిన్ దుకాణాలు, తోపుడు బండ్లు, ఇస్త్రీ, చిల్లర దుకాణాలు వంటి వాటిల్లో కూడా క్యూఆర్ కోడ్‌లు ఉంటున్నాయి. ఆయా దుకాణాల్లో నిత్యం వేలాది రూపాయలు డివిజిట్ లావాదేవీల ద్వారానే జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రెండు లక్షలకు పైగా జనాభా ఉన్నారు. వీరిలో సుమారు 70 శాతం మంది డిజిటల్ లావాదేవీలను వినియోగిస్తున్నారని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

కోవిడ్‌తో మార్పులు

పెద్ద నోట్ల రద్దు అనంతరం ఆన్‌లైన్ లావాదేవీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. మొదట్లో పెద్ద పట్టణాల్లో మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గా.. కొన్ని అపోహలతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. పేమెంట్ యాప్‌లతో అన్ని చోట్లా ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యమిచ్చారు. కిరాణా, ఫ్యాన్సీ మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర దుకాణాలతో పాటు, మొబైల్, డీటీహెచ్, గ్యాస్, విద్యుత్ బిల్లులు, ఫుడ్ డెలివరీ, ఇతర అవసరాలకు ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నారు.

స్పీకర్‌తో అక్రమాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు, ఆదమరిస్తే మోసాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. సరకులను కొనుగోలు చేశాక వేరే వారికి నగదు బదిలీ చేస్తారు. ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ మెసేజ్‌ను దికాణదారుడికి చూపించి, మెల్లగా అక్కడి నుంచి జారుకుంటారు. ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు అందుబాటులోని వచ్చాయి. ఆన్‌లైన్ చెల్లింపులు కాగానే.. ఎంత నగదు దుకాణదారుని ఖాతాకు జమైందో వాయిస్ రూపంలో వినిపిస్తుంది.

చిల్లర సమస్య తప్పింది



ప్రస్తుతం జేబులో డబ్బు లేకపోయినా, బ్యాంకు ఖాతాలో సొమ్ము ఉంటే క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసిన సరకుల ధర కన్నా ఎక్కువ సొమ్ము ఇస్తే.. చిల్లర లేదనే సాకుతో వ్యాపారి అవసరం లేకపోయినా వేరే సామాన్లను అంటగట్టేవారు. ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపులతో ప్రస్తుతం చిల్లర సమస్య తప్పింది.

– బత్తుల అప్పారావు, వ్యాపారి, కుందూరు

డిజిటల్ చెల్లింపులే ఎక్కువ



నాది గిఫ్ట్ షాపుతో పాటు, వాచీల వ్యాపారం ఉంది. గతంలో నగదు లావాదేవీలు జరిగేటప్పుడు తరచూ చిల్లర సమస్య తలెత్తేది. చిల్లర ఇవ్వకపోతే సరకులు కొనేవారు కాదు. ఇప్పుడు నగదు రహిత లావాదేవీలే ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఆ సమస్య తీరి, వస్తువు ధరకు అనుగుణంగా సొమ్మును క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లిస్తున్నారు.

– పెంకే రవిచంద్ర, వ్యాపారి, పామర్రు

స్వచ్ఛమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

రాయవరం: మధ్యాహ్న భోజన పథకాన్ని రుచిగా, శుచిగా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు సూచించారు. రాయవరం మోడల్ ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలన చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు వడ్డించే ముందుగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా రుచి చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, రక్షణ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని వారు రుచి చూశారు. బుద్ధవరపు చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.నాగిరెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎంఈవో–2 వై.సూర్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సర్వేపల్లికి చిత్ర నీరాజనం



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో డాక్టర్ సర్వేపల్లి చిత్రం



అక్షరాల్లో ఒదిగిన డాక్టర్ సర్వేపల్లి

రామచంద్రపురం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు రూపొందించారు. రామచంద్రపురం మండలం హసన్‌బాదలోని జెడ్పీ హైస్కూల్‌లో ఈ 'చిత్ర' నీరాజనం పలువురిని ఆకట్టుకుంది. డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వీరభద్రేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సుమారు 21 అడుగుల డాక్టర్ సర్వేపల్లి చిత్రాన్ని ప్లే గ్రౌండ్‌లో రూపొందించారు. అదేవిధంగా రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ రావి ఆకుపై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని రూపొందించి ఆకట్టుకున్నారు.

అక్షర నివాళి

రాయవరం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వెదురుపాకకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చిర్రా వెంకటమోహన్ అక్షరాలతో ఆయన చిత్రపటాన్ని రూపొందించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్షర నివాళులర్పించారు. ఆయనను పలువురు అభినందించారు.

గొల్లపాలెం హైస్కూల్ విశేష 'ప్రతిభ'



విద్యార్థులను అభినందిస్తున్న స్కూలు ఉపాధ్యాయులు, నాయకులు

కాజులూరు: స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారాల ఎంపికలో ఈ ఏడాది కాజులూరు మండలం గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి వెల్లడించారు. గురువారం పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు జి సునీల్‌కుమార్ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఆమె మాట్లాడుతూ, గతేడాది వాలీబాల్, సాఫ్ట్ బాల్, ఖోఖో, అథ్లెటిక్స్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బహుమతులు, ప్రశంసాపత్రాలు సాధించారన్నారు. ఏడుగురు రాష్ట్ర స్థాయిలో మెరిట్ రజిత పతకాలు పొందారన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జిల్లా ప్రథమ స్థాయిలో అవార్డు సాధించామన్నారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకే గ్రౌండ్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారుల నుంచి అవార్డు తీసుకోనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజావెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ముర్రే శివశంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఊపందుకున్న విగ్రహాల నిమజ్జనాలు



కోటిపల్లి వద్ద గోదావరిలో నిమజ్జనం కోసం విగ్రహాన్ని పంటుపై తరలిస్తున్న భక్తులు

కె.గంగవరం: నవరాత్ర పూజలు ముగించుకున్న గణేశ్ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని కోటిపల్లిలో గోదావరి వద్ద గణేశ్ నిమజ్జనాలు గురువారం ఉదయం నుంచి ఊపందుకున్నాయి. గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల పడవపై విగ్రహాలను ఉంచి, గజ ఈతగాళ్లు, పోలీసుల బందోబస్తు మధ్య నిమజ్జనం చేస్తున్నారు. ప్రతి ఏటా నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం, రామచంద్రపురం రూరల్ మండలాల నుంచి పలు గ్రామాల్లో కొలువైన గణేశ్ విగ్రహాలను నవరాత్ర పూజల అనంతరం మండల పరిధిలోని కోటిపల్లిలో ఉన్న గౌతమి గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు పోటెత్తుతారు. విగ్రహంతో పాటు, అధిక సంఖ్యలో భక్తులు తీన్మార్ డప్పులు, బాణసంచాతో ఊరేగింపుగా కోటిపల్లి చేరుకుంటారు. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో విగ్రహాలు కోటిపల్లికి వస్తాయని అంచనా కాగా, పోలీసులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



బత్తిన రాజరాజేశ్వరి



పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు



నూలు ఆదినారాయణ



గరగ సీతాదేవి



సంపర వేణుగోపాల సింగుబాబు



కోరుమిల్లి వెంకటరమణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, గ్రేడ్–2 హెచ్‌ఎం బత్తిన రాజరాజేశ్వరి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శాటిలైట్ సిటీ బి–బ్లాక్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల (ప్లస్) ప్రధానోపాధ్యాయినిగా అందించిన సేవలకు ఆమెకు రాష్ట్ర స్థాయి గుర్తింపు దక్కింది. సాంఘిక శాస్త్రం బోధనలో 24 ఏళ్ల అనుభవం కలిగిన ఆమె.. మన బడి.. మన భవిష్యత్ కార్యక్రమం విజయవంతం చేసినందుకు 2021 ఆగస్టు 16న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా అవార్డు పొందారు. గతేడాది జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. తన కృషికి గుర్తింపు దక్కినందుకు సంతోషంగా ఉందని, మరింత ఉత్తేజంతో కృషి చేస్తానని రాజేశ్వరి అన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వరరావు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమలాపురంలో జరిగే కార్యక్రమంలో విద్యా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆయన అవార్డు అందుకోనున్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ఈ ఏడాది అక్టోబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఈయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంఈఓలు నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కాజులూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కాజులూరు మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు ఎంఈవో దాసరపల్లి డేవిడ్ తెలిపారు. తణుకువాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం నరసింహ ప్రభాకర్, అంద్రంగి హైస్కూల్‌కు చెందిన నక్కా వెంకటలక్ష్మి, కుయ్యేరు హైస్కూల్‌కు చెందిన పి.ఉమాకాంత్ ఎంపికయ్యారన్నారు.

నలుగురి ఎంపిక

రాయవరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా రాయవరం మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా విడుదల చేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుల విభాగం నుంచి పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నూలు ఆదినారాయణ, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ గరగ సీతాదేవి, వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు సంపర వేణుగోపాల సింగుబాబు, ఎస్‌జీటీ విభాగంలో పసలపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలలో పీఎస్ హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణ ఎంపికయ్యారన్నారు. వీరికి అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శుక్రవారం ఉదయం అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.

నేడు సత్కారం

రాయవరం మండల పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. మండలంలోని రాయవరం, వెంటూరు, చెల్లూరు, పసలపూడి కాంప్లెక్స్‌ల పరిధిలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారి పి.రామచంద్రమూర్తి గురువారం తెలిపారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎస్.ఆదినారాయణ, పసలపూడి కాంప్లెక్స్ నుంచి జి.జయలక్ష్మి(ఎస్ఏ–మ్యాథ్స్), పి.మాధవి(ఎస్ఏ–పీఎస్), ఎంఆర్ఆర్ఎల్ కుమారి(ఎస్‌జీటీ), ఎస్.సోమిరెడ్డి(ఎస్‌జీటీ), రాయవరం కాంప్లెక్స్ నుంచి బీహెచ్ శ్రీనివాస్(ఎస్ఏ–ఇంగ్లిష్), కె.వీ రాశేఖరరావు(ఎస్ఏ–పీఎస్), ఎం.విజయకుమార్(ఎస్‌జీటీ), ఎం.చంద్రకళ(ఎస్‌జీటీ), చెల్లూరు కాంప్లెక్స్ నుంచి సత్యకుమారి(ఎస్ఏ–తెలుగు), ఎస్.విజయకుమార్(ఎస్ఏ–తెలుగు), ఎ.కృష్ణమోహన్(ఎస్‌జీటీ), సీహెచ్ శ్రీరామప్రతాప్(ఎస్‌జీటీ), వెంటూరు కాంప్లెక్స్ నుంచి పి.హరి సూర్యనారాయణ(ఎస్ఏ–బీఎస్), వి.వీరవెంకటరాజు(ఎస్ఏ–బీఎస్), వి.పుష్పవాణి(ఎస్‌జీటీ), వి.మహాలక్ష్మి(ఎస్‌జీటీ)ని ఎంపిక చేశారు. ఉత్తమ సీఆర్‌ఎంటీలుగా వైఎల్ వీర్రాజు, కె.సీనాసిరి ఎంపికయ్యారు.

గురువులకు గౌరవం

పలువురు ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు



వాసా ధన మహాలక్ష్మి



రేలంగి నాగకుమార్



మేకా రామలక్ష్మి



చోడే కృష్ణమూర్తి

కపిలేశ్వరపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండపేట నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు దక్కాయి. విద్యాబోధన, పాఠశాల నిర్వహణ, విద్యార్థులతో శాస్త్రీయ పద్ధతిలో మమేకం కావడం తదితర అంశాల ఆధారంగా ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరు మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వాసా ధన మహాలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. టీటీసీ చేసి 2000 నవంబర్ 27న ఐ.పోలవరం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా చేరారు. తర్వాత అనపర్తి మండలం, కపిలేశ్వరపురం మండలం వల్లూరుల్లో పనిచేశారు. కృత్యాధార బోధన, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను ఆసక్తితో తీర్చిదిద్దడం ఆమె ప్రత్యేకత. ఎంఈఓలు కె.తాతారావు, విజయ్ కుమార్, హెచ్‌ఎం కావూరి వెంకటరమరణ, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

మండపేట మండలంలో..

మండపేట పట్టణంలోని శ్రీవేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రేలంగి నాగకుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎన్నికయ్యారు. బీకాం ఎంపీఈడీ చేసిన ఆయన 1996లో మండపేటలోని ఇదే పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడిగా చేరారు. తర్వాత కడియం, అనపర్తిల్లో పనిచేశారు. 2023 జూలైలో మండపేటలో హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు.

ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మేకా రామలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఎమ్మెస్సీ బీఈడీ చేసి 2012లో స్కూల్ అసిస్టెంట్‌గా మండపేటలోని శ్రీగౌతమి మున్సిపల్ హైస్కూల్‌లో చేరారు. జూన్‌లో ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆమె పర్యవేక్షణలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ఐదుసార్లు ప్రతిభ కనబర్చారు. మలేసియా సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన గ్లోబల్ మీట్‌లో ఆమె తీర్చిదిద్దిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.

కేశవరం మండల ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎం చోడే కృష్ణమూర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. బీఎస్సీ, బీఈడీ చేసిన ఆయన 1995లో మోదుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత హుక్కుంపేట, ఒడిసలేరు, వెలగతోడుల్లో పనిచేశారు. ఈ ఏడాది జూన్‌లో కేశవరం పాఠశాలకు బదిలీపై వచ్చారు. అవార్డులకు ఎంపికైన వారికి ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, చింతా వెంకట సోమిరెడ్డి అభినందనలు తెలిపారు.

సంక్షిప్తంగా..

విశ్రాంత హెచ్‌ఎంకు సత్కారం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ప్రాథమిక పాఠశాలగా ఉన్న నున్న వారి స్కూలు హైస్కూల్‌గా రూపాంతరం చెంది పాతికేళ్లయిన సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం ముందస్తు గురుపూజోత్సవం నిర్వహించారు. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు కోట కృష్ణమూర్తి మాస్టారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ఆ ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి

కపిలేశ్వరపురం: ప్రైవేటు సంస్థకు భూములు కేటాయించడం ద్వారా వాటిని కోల్పోయిన రైతులకు మద్దతుగా పోరాడుతున్న ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డితో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా పాలన సాగిస్తోందన్నారు.

జూదరులకు జరిమానా

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని ద్వారపూడి, ఏడిద గ్రామాల్లో గత నెల ఆగస్టులో పేకాట శిబిరాలపై మండపేట రూరల్ పోలీసులు దాడులు చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చగా, ఆయా గ్రామాలకు చెందిన 11 మందికి గురువారం ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై వి.కిశోర్ తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం

కె.గంగవరం: వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ కృషి చేస్తుందని సంఘ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ అన్నారు. మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాలలో గురువారం సంఘ సభ్యులతో కలసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు, సంఘ సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామన్నారు. ఎన్నికల్లో గెలిచి ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకూ సమస్యలు పరిష్కరించకపోగా, కనీసం ఒక్క డీఏ కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే డీఏను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించి, బోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా చూడాలన్నారు. నాయకులు దాసరి శ్రీనివాసు, ప్రదీప్‌కుమార్, రవి, ఎర్ర ఈశ్వరుడు, సీహెచ్‌వీఎస్ఎన్ చౌదరి, కృష్ణార్జునరావు, గోపాలకృష్ణ, కందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

కాజులూరు: సేద్యంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టినప్పుడే నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించగలుగుతారని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గురువారం శీలలో ఆయన రైతులతో మాట్లాడుతూ, అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ, నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీఓ) ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో మరమ్మతుల కోసం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ద్రాక్షారామ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.